సాక్షి నారాయణపేట

సోమవారం । 23 । జూన్ । 2025



..నేషనల్ క్రికెట్ టోర్నీ

పాలమూరు జిల్లాకు జాతీయస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించే అవకాశం వచ్చింది.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం స్వల్పంగా తగ్గింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.4 /22.3

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్చకుల సమస్యలు తెలుసుకునేందుకే గుడిబాట



నర్వ: దూప దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకుల సమస్యలు తెలుసుకునేందుకే గుడి బాట కార్యక్రమం చేపట్టామని డీడీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మాడపాటి జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం నర్వ మండలంలోని పలు దేవాలయాలను సందర్శించి అర్చకుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని, ఆధ్యాత్మికతను హిందూ సమాజానికి అందిస్తూ, ధర్మ పరిరక్షణకు కృషిచేస్తున్న అర్చకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం అర్చకులను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డీడీఎస్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోషి రామాచారి, ప్రవీణ్ కద్మూర్, మండల అధ్యక్షుడు నర్సింహయ్య, నాగస్వామి, అంపయ్య, మధుసూదన్‌చారి, సిద్ధయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎయిడెడ్ దయానంద్ విద్యా మందిర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేసి.. ఓపీఎస్ అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న హెచ్‌ఎంల పోస్టులను భర్తీ చేయడంతో పాటు డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను ఉపాధ్యాయ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు పారితోషికం చెల్లించాలన్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు వేతన సమస్య తీర్చడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. రెండేళ్లుగా ప్రకటించాల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే వెలువరించి.. మెరుగైన పీఆర్సీ అమలు చేయాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులకు బకాయి బిల్లులతో పాటు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, మిగిలిన డీఏలను చెల్లించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల పనివేళలు మార్చాలని.. కేజీబీవీ టీచర్లకు బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు కె.బాలాజీ, రవికుమార్, గోవిందు, వెంకట్ నాయక్, వెంకటేశ్, శంకర్ ఉన్నారు.

4 వేల బస్తాల వరిధాన్యం రాక

నవాబుపేట: స్థానిక మార్కెట్‌కు ఆదివారం ఆర్‌ఎన్‌ఆర్, ఇతర సీడ్ (1010)లు కలిసి దాదాపు 4 వేల బస్తాలకు పైగా ధాన్యం వచ్చిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేష్ తెలిపారు. కాగా.. వరి (1010) రకం 1,209 బస్తాలు రాగా క్వింటాల్ గరిష్టంగా రూ.1,963 ధర వచ్చింది. అలాగే వరి ఆర్‌ఎన్‌ఆర్ 3,628 బస్తాలు రాగా క్వింటాల్ గరిష్టంగా రూ.2,285, కనిష్టంగా రూ.1,512 ధర పలికిందని కార్యదర్శి తెలిపారు.

ఆర్టీసీ బాదుడు



కిలోమీటర్ల రౌండప్ చార్జీలతో అదనపు భారం

- టోల్‌గేట్ దాటితే మరో రూ.10 వడ్డింపు
- మహిళలకు ఉచిత ప్రయాణంతో తీవ్రమైన ఇబ్బందులు
- ఇప్పటికే సీట్లు దొరకక పురుష ప్రయాణికుల అసహనం
- తాజాగా ధరల పెంపుతో మరింత పెరిగిన అయిష్టత

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగగా అందుకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జీరో టికెట్ మీద ప్రయాణించే అతివలు సైతం కనీసం నిల్చొనే చోటు లేక ఇక్కట్లు పడుతుండగా.. ఇక డబ్బులు పెట్టి ప్రయాణం చేస్తున్న పురుషుల సంగతి సరేసరే. ఈ తరుణంలో పాఠశాల, కళాశాలలకు చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారాలకు రెగ్యులర్ ప్రయాణం చేస్తున్నవారు, ఇతర ప్రయాణికులు ఆర్టీసీ యాజమాన్యం అంతర్గతంగా జారీ చేసిన ఆదేశాలతో స్థానిక అధికారులు పెంచిన చార్జీలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు కొందరు పురుష ప్రయాణికులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

– నారాయణపేట రూరల్



నారాయణపేటలో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సర్దుబాటు, టోల్ ప్లాజా పేర్లతో..

ఆర్టీసీలో పల్లె వెలుగు బస్సుల టికెట్ ధరలు కిలోమీటర్ల రౌండ్ ఫిగర్‌తో నిర్ణయించబడి ఉంటుంది. అయితే ఎక్స్‌ప్రెస్ సర్వీసులో మాత్రం సరిగ్గా కిలోమీటర్‌కి లెక్కించి టికెట్ ధర నిర్ణయిస్తారు. అయితే గతంలో చిల్లర సమస్య పేరుతో టికెట్ ధరలను రౌండప్ పేరుతో పెంచారు. తాజాగా మరోసారి కిలోమీటర్లను సర్దుబాటు చేస్తున్నామనే పేరుతో రూ.10 పెంచేశారు. దీంతో ప్రతి ప్రయాణికుడిపై అదనపు భారం పడనుంది. దీనికితోడు టోల్‌గేట్ దాటి ప్రయాణించే ప్రతి ప్రయాణికుడు అదనంగా మరో రూ.10 చెల్లించాల్సి వస్తుంది. దీంతో ఆయా మార్గాల్లోని ప్రయాణికులపై గరిష్టంగా రూ.20 భారం పడినట్లయ్యింది.

ఇష్టారీతిగా పెంచడం సరికాదు



గతంలో చిల్లర సమస్య పేరుతో చార్జీలను రౌండ్ ఫిగర్ చేసి భారం మోపిన ఆర్టీసీ తాజాగా కిలోమీటర్లను రౌండ్ ఫిగర్ చేస్తున్నట్లు అసంబద్ధంగా ఇష్టారీతిగా చార్జీలు పెంచడం సరికాదు. ప్రతి టికెట్‌పై రూ.10, టోల్‌గేట్ దాటితే అదనంగా మరో రూ.10 వసూలు చేస్తున్నారు. సీజన్ పాస్ నెలకు మరో రూ.400 చెల్లించాల్సి వస్తుంది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– సందీప్, ప్రయాణికుడు, నారాయణపేట

పేద విద్యార్థులపై ఆర్థిక భారం..



ఉన్నత విద్యను అభ్యసించాలని ఆర్టీసీ బస్సుల్లో పట్టణాలకు వచ్చే పేద, మధ్య తరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం సరికాదు. రూ.75 నుంచి ఏకంగా రూ.275 చొప్పున నెలవారీ రాయితీ పాసుల ధరలను పెంచడం ఆయా కుటుంబాలకు మోయలేని భారంగా మారుతుంది. ఆడపిల్లలతోపాటు చదువుకునే బాలురకు సైతం ఉచితంగా పాసులు అందించి ఆదుకోవాలి.

– నరేష్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్, నారాయణపేట

స్వల్పంగా పెరిగింది..

ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో టోల్‌గేట్ ధరలను పెంచుతుంది. ఈ క్రమంలో ఆర్టీసీ అందుకు అనుగుణంగా ప్రయాణికుల టికెట్‌పై ఆ భారాన్ని సరిచేస్తారు. ఈసారి కొంత ఆలస్యంగా వాటిని అమలు చేశాం. ఇక పల్లె వెలుగు మాదిరి ఎక్స్‌ప్రెస్ బస్సులకు సైతం రౌండప్ కిలోమీటర్లకు టికెట్ ధరను సరిచేయడంతో కొన్ని స్టేజీలకు టికెట్‌పై స్వల్పంగా ధర పెరిగింది.

– సంతోష్‌కుమార్, రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

20 రోజుల చార్జీతో..

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే నెలవారీ రూట్ పాస్ చార్జీలను సైతం ఆర్టీసీ పెంచింది. 20 రోజుల చార్జీతో నెల రోజులపాటు ప్రయాణం చేయడానికి అందించే సీజన్ పాసులపై రూ.400 అదనంగా వసూలు చేయనున్నారు. ఇక 12 సంవత్సరాలు నిండిన బాలురకు పల్లె వెలుగు బస్సుల్లో అందించే రాయితీ బస్ పాస్ ధరలను సైతం అమాంతం పెంచారు. 5 కిలోమీటర్ల నుంచి 35 కిలోమీటర్ల మధ్య విద్యార్థి ఇంటి నుంచి విద్యాసంస్థ వరకు ప్రయాణం చేస్తారు. దీనికి రూ.150 నుంచి మొదలయ్యే పాస్ ధర కనిష్టంగా నెలకు రూ.75 నుంచి గరిష్టంగా రూ.275 వరకు ఉంది.


2024- 25లో ఇచ్చిన బస్‌పాస్‌ల వివరాలిలా..

డిపో	సీజన్ టికెట్లు	స్టూడెంట్ పాస్‌లు	దివ్యాంగులు
మహబూబ్‌నగర్	2,257	21,292	1,568
వనపర్తి	2,037	17,739	1,864
నారాయణపేట	587	13,132	2,086
షాద్‌నగర్	1,265	11,436	694
నాగర్‌కర్నూల్	1,640	10,031	883
గద్వాల	1,411	7,164	988
కల్వకుర్తి	452	4,961	797
అచ్చంపేట	105	4,382	734
కోస్గి	178	2,578	399
కొల్లాపూర్	504	1,891	597

నెలవారీ విద్యార్థి పాసుల పెంపు ఇలా..

కి.మీ.,	పాత చార్జీ	కొత్త చార్జీ
5	150	225
10	250	375
15	300	450
20	400	600
25	450	675
30	500	750
35	550	825

జూరాల కాల్వకు నీటి విడుదల



జూరాల ఎడమ కాల్వలో పారుతున్న నీరు

అమరచింత: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తుండటంతో ఆయకట్టు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో ప్రధాన ఎడమ కాల్వకు ఆదివారం డీఈ నారాయణ, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యూబ్‌ఖాన్ ప్రత్యేక పూజలు చేసి నీటిని వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మునుపెన్నడూ లేని విధంగా ముందస్తుగా ఆయకట్టుకు సాగునీటిని వదులుతున్నామని చెప్పారు. రిజర్వాయర్లతో పాటు ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా పీజేపీ సిబ్బంది నిరంతరం కాల్వ వెంట తిరుగుతూ ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటున్నమన్నారు. కార్యక్రమంలో పీజేపీ ఏఈ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, చుక్కా ఆశిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, రహమతుల్లా, పరమేష్, నల్గొండ శ్రీను, మొగిలి గంగాధర్‌గౌడ్, బంగారు భాస్కర్, తులసీరాజ్, ఏకే వెంకటేశ్వర్‌రెడ్డి, హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుడి, ఎడమ కాల్వలకు..

జూరాలకు ఎగువ నుంచి వరద వస్తుండటంతో ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, నీటిని, కుడి కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఏటా వానాకాలం పంటల సాగుకు జులై చివర, ఆగస్టులో సాగునీరు వదిలే వారని.. ఈసారి ముందస్తుగా జూన్‌లోనే ఆయకట్టుకు నీటిని అందించడం హర్షణీయమన్నారు.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల నుంచి ఒక పంపును రన్ చేసి నీటిని విడుదల చేస్తుండటంతో ఆదివారం సాయంత్రం వరకు 17.6 అడుగులకు చేరింది. ఈ నెల 1న జూరాల వద్ద ఉన్న ఫేస్–1 ఉంద్యాల పంపుహౌస్ నుంచి ఒక పంపు ద్వారా నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి పర్దీపూర్ రిజర్వాయర్‌కు తరలించారు. ఆ తర్వాత 6న ఫేస్–2 తీలేర్ పంపుహస్‌కు వద్దకు చేరిన నీటిని అక్కడ ఒక పంపును రన్ చేసి నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 22 రోజులుగా కోయిల్‌సాగర్‌కు నీటి విడుదల కొనసాగుతుంది. జూరాల నుంచి నీరు రాక ముందు 11 అడుగులుగా ఉన్న నీటిమట్టం 6.6 అడుగులు పెరిగి 17.6 అడుగులకు చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా మరో 9 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి గేట్ల లెవల్ వరకు 32.6 అడుగులుగా ఉండగా.. మరో 15 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది.

రూ.3,272 కోట్లతో అభివృద్ధి పనులు



విలేకర్లతో మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కృషితో గతంలో ఎన్నడూ లేనివిధంగా 18 నెలల కాలంలోనే రూ. 3,272 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. పక్కనే కృష్ణానది పారుతున్నా సాగునీరు తేలేని ఐరన్ లెగ్ ఎస్ఆర్.రెడ్డి అని.. ఎమ్మెల్యే గోల్డెన్ లెగ్‌తో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమవుతున్నాయని ఆయన తూర్పారబట్టారు. ఆదివారం స్థానిక సీవీఆర్ భవన్‌లోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ. 2.945 కోట్లు, మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రూ. 40కోట్లు, నర్సింగ్ కళాశాలకు రూ. 26కోట్లు, 33/11కేవీ సబ్ స్టేషన్లకు రూ. 11కోట్లు, నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 10కోట్లు, ఎస్సీ కాలనీల అభివృద్ధికి రూ. 10కోట్లు, బీటీరోడ్లకు రూ. 13కోట్లు, రోడ్ల మరమ్మతులకు రూ. 35.79కోట్లు, జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా వద్ద జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు రూ. 1.23 కోట్లు, మహిళా సమాఖ్య నూతన భవనానికి రూ. 5కోట్లు మంజూరైనట్లు వివరించారు. అదే విధంగా రూ. 175కోట్లతో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని త్వరలోనే వినియోగంలోకి తెస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రూ. 7.50 కోట్లతో చిల్డ్రన్ ఆస్పత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అకాల వర్షాలతో జిల్లా ఆస్పత్రి భవనం కూలిపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ సూచన మేరకు మెడికల్ కళాశాలలోకి మార్చడం జరిగిందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనం తొలగించి, నూతన కమ్యూనిటీ ఆస్పత్రి భవనం నిర్మిస్తామన్నారు. 2018 ఎన్నికల సమయంలో కృష్ణాజలాలతో రైతుల కాళ్లు కడుగుతానని.. లేకపోతే మళ్లీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన వ్యక్తి 2023లో ఎందుకు పోటీ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోయిల్‌కొండ మండలంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని అడ్డుకున్నదెవరో ప్రజలకు తెలుసని అన్నారు. బీజేపీ నాయకులకు ప్రతీది రాజకీయం చేయడం అలవాటుగా మారిందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, ఆర్టీఏ బోర్డు సభ్యుడు రాజేశ్‌కుమార్, నాయకులు మనోహర్‌గౌడ్, గందె చంద్రకాంత్, వకీల్ సంతోష్, సరాఫ్ నాగరాజ్, మాజీ కౌన్సిలర్ మహేశ్, వెంకుగౌడ్ ఉన్నారు.

ఆమడదూరంలో అపార్

'నారాయణపేట మండలంలోని భైరంకొండ గ్రామానికి చెందిన విద్యార్థి పుట్టినతేదీ యు డైస్‌లో ఒక విధంగా, ఆధార్ కార్డులో మరో విధంగా ఉండటంతో అపార్ జనరేషన్ కాలేదు. అలాగే షేర్నపల్లికి చెందిన ఓ విద్యార్థిని యు డైస్‌లో ఇంటి పేరు ఉండగా, ఆధార్‌కార్డులో లేకపోవడంతో మ్యాచ్ కాక అపార్ జనరేట్ కాలేదు.. జిల్లాలో ఇలా చాలామంది విద్యార్థులకు ఈ పరిస్థితి నెలకొంది.



మందకొడిగా సాగుతున్న విద్యార్థుల నమోదు

- ఆధార్‌తో వివరాలు సరిపోక తీవ్ర జాప్యం
- విద్యాసంస్థల్లో తప్పని అవాంతరాలు
- నూతన విద్యా సంవత్సరంలో ప్రారంభం కాని ప్రక్రియ
- జిల్లాలో 61శాతం మాత్రమే పూర్తి..

నారాయణపేట రూరల్: జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికి అపార్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల, కార్పొరేట్ విద్యాసంస్థలలో కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ సంఖ్యను కేటాయించాలని నిర్ణయించారు. ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం 2023 అక్టోబర్ 18న ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఆది నుంచి అవాంతరాలు ఎదురవుతున్నాయి. వాస్తవానికి గత ఏడాది చివరి వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఆధార్ లోని సమాచారం విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్ లోని వివరాలతో సరిపోలక సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి. ఎందుకు కారణంగా నిర్ణీత సమయంలో నమోదు ప్రక్రియ పూర్తికాక ఆలస్యం అవుతుందని వాదన వినిపిస్తుంది.

సమాచారంలో తేడాలతో జాప్యం

చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్ లో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేసేందుకు పాఠశాలకు ప్రత్యేక ఐడీలు ఉంటాయి. వీటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వ అపార్ కార్డులను మంజూరు చేయనున్నారు. విద్యార్హతలు, గ్రేడ్లు, మార్కులు, సాధించిన ప్రగతి, ఉపకార వేతనాలు, ఇతర ధ్రువీకరణ పత్రాల సమాచారాన్ని, కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరుస్తారు. ఉన్నత విద్యా ప్రవేశాలు, పోటీ పరీక్షల కు ఈ డిజిటల్ పత్రాలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇదిలాఉండగా, జిల్లాలోని 13 మండల పరిధిలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో కలిపి 1,04,428 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా కేవలం 55,699 మంది విద్యార్థుల వివరాలు ఇప్పటి వరకు అపార్ కు అనుకూలంగా ఉండి 61శాతం నమోదైంది. మిగతా విద్యార్థులకు సంబంధించిన సమాచారంలో తేడాలు ఉండడంతో నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా ఆధార్ లోని విద్యార్థి పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీ లలో అడ్మిషన్ రిజిస్టర్ లతో పోలికలు కుదరక అపార్ జనరేట్ కావడం లేదు. అన్ని వివరాలు సరిపోలిన విద్యార్థులకి ఇబ్బంది లేకుండా అపార్ నమోదవుతుంది. కొన్నిచోట్ల ముఖ్యంగా పాఠశాలలలో ఆధార్ ను సరిచూసుకొని వారి అడ్మిషన్ రికార్డులలో వివరాలు సరిచేసి అపార్ నమోదు చేస్తున్నట్లు తెలిసింది. టెన్త్ పూర్తయి కళాశాలలకు వెళ్లిన విద్యార్థులకు ఈ వెసులుబాటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా విద్యార్థులు తప్పకుండా ఆధార్ కార్డు లోని వివరాలను సరి చేసుకోవాల్సి ఉండడంతో స్థానికంగా ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉంచకపోవడంతో హైదరాబాద్ కు పరుగులు పెడుతున్నారు.

మొదటి స్థానంలో కొత్తపల్లి.. చివరలో నర్వ

జిల్లాలోని 13 మండలాల్లో ప్రక్రియ మందకొడిగానే సాగుతోంది. కొత్తగా ఏర్పాటు అయిన కొత్తపల్లి మండలంలో 62శాతం అపార్ పూర్తి చేసి మొదటి స్థానంలో నిలువగా, 42 శాతం మాత్రమే ఆన్‌లైన్ చేసి నర్వ చివరి స్థానంలో ఉంది. విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు రోజువారీగా పాఠశాలలపై ఒత్తిడి తెస్తున్న సాంకేతిక కారణాల దృష్ట్యా అపార్ ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. ఆధార్ సమాచారం సరి చేసుకోవడానికి పెట్టుకునే దరఖాస్తు పరంగా అవసరమైన పత్రాలను తొందరగా మంజూరయ్యే విధంగా మండల యంత్రాంగం దృష్టి సారించడంతో పాటు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను తెరిస్తే విద్యార్థులకు ప్రయోజన కరంగా ఉంటుంది. కొత్త విద్య సంవత్సరం ప్రారంభం కావడంతో నూతనంగా చేరే విద్యార్థులకు సైతం అపార్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ సంఖ్య మరింత పెరగనుంది.



విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో విద్యార్థుల వివరాలిలా..

మండలం	మొత్తం విద్యార్థులు	అపార్ పూర్తయ్యింది	శాతాల్లో
నారాయణపేట	22,005	13,015	59
మక్తల్	17,977	8,819	49
కోస్గి	9,570	4,729	49
మద్దూర్	8,924	4,466	50
ఉట్కూర్	7,008	4,279	61
దామరగిద్ద	7,386	4,240	57
మరికల్	7,598	3,813	50
ధన్వాడ	6,355	3,205	50
కృష్ణా	4,368	2,443	56
మాగనూరు	4,177	2,235	54
కొత్తపల్లి	1,831	1,214	66
నర్వ	5,095	2,136	42
గుండుమాల్	2,134	1,105	52
మొత్తం	1,04,428	55,699	61

వంద శాతం పూర్తి చేస్తాం



విద్యార్థుల ఆధార్ నంబర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం, విద్యార్థుల వివరాలు ఆధార్ కార్డులో, అడ్మిషన్ రికార్డులలో వేరువేరుగా ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో నమోదు ప్రక్రియ ముందుకు సాగడంలేదు. సాంకేతిక సమస్యలు తొలగిపోతే పూర్తిస్థాయిలో అపార్ నమోదు జరగనుంది. ఆధార్ తప్పులను సరి చేసుకునేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరలో వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– గోవిందరాజు, డీఈఓ



జాజాపూర్ పాఠశాలలో విద్యార్థులు

కేజీబీవీల్లో ఇక కొత్త మెనూ

- పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- నెలలో రెండుసార్లు మటన్‌తో భోజనం



అందని వేతనాలు.. కార్మికుల పస్తులు

- మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బందులు
- మూడు నెలలుగా చెల్లింపుల్లో జాప్యం
- అర్ధాకలితో విధులకు హాజరు

వివరాలు 9లో ▸

క్లుప్తంగా

చేతబడి ఘటనపై విచారణ

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంట గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్న చేతబడి ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఓ చేతబడి చేశాడని చెప్పులు మెడలో వేసి గ్రామంలో ఊరేగించారని 'సాక్షి'లో ఆదివారం వార్త ప్రచురితమైంది. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ బాధితులతో మాట్లాడుతున్నామని, త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. అయితే ఈ సంఘటనలో ఇద్దరూ వృద్ధులే కావడంతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పోలీసులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గొరిటకు చెందిన ఎండీ రవూఫ్ (47) ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల వద్ద డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. శనివారం పనులు ముగించుకొని రాత్రి వేళ స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. బాదేపల్లిలోని నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో ప్రధాన రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రవూఫ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి.. అటు నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మిషన్ భగీరథ నీటిలో పురుగులు



అమరచింత: మండలంలోని నందిమళ్ల లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగు నీటిలో ఆదివారం పురుగులు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు వస్తున్నాయన్న విషయాన్ని మిషన్ భగీరథ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకులను వారానికోసారి శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమవుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోనూ ఓవర్ హెడ్ ట్యాంకులను మూడు నెలలకోసారి శుభ్రపరిచే వారేలేరని ఆరోపిస్తున్నారు.అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తిమ్మాజిపేట: బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా.. బిజినేపల్లి మండలం ఖానాపూర్ కి చెందిన ఊషన్న మండల కేంద్రం సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో కోడుపర్తికి చెందిన వెంకటయ్య బైక్‌పై వెళ్తూ ఊషన్నను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఊషన్నకు తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య చిన్న మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



జిల్లా కేంద్రంలో అండర్- 17 ఎస్‌జీఎఫ్ నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో తలపడుతున్న జట్లు (ఫైల్)

పాలమూరుకు నేషనల్ క్రికెట్ టోర్నీ

- క్యాలెండర్ విడుదల చేసిన ఎస్‌జీఎఫ్
- 69వ అండర్-17 క్రికెట్ టోర్నీ
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా మరోమారు జాతీయస్థాయి టోర్నీ నిర్వహించేందుకు అవకాశం వచ్చింది. ఇప్పటికే పలు జాతీయస్థాయి టోర్నీలు నిర్వహించిన నేపథ్యంలో 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్- 17 బాలుర, బాలికల చాంపియన్‌షిప్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

అండర్- 17 బాల, బాలికల క్రికెట్ టోర్నీ

ఇటీవలే నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2025-26 జాతీయస్థాయి టోర్నీలకు సంబంధించిన క్యాలెండర్ విడుదల చేయగా, మహబూబ్‌నగర్‌కు అండర్- 17 విభాగం బాల, బాలికల క్రికెట్ చాంపియన్‌షిప్ క్రీడలను కేటాయించారు. అండర్- 17 విభాగం బాలుర క్రికెట్ టోర్నమెంట్‌ను దసరా సెలవుల్లో అనగా అక్టోబర్‌లో, బాలికల క్రికెట్ పోటీలు జనవరి నెలలో నిర్వహించడానికి జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రణాళికలు రూపొందిస్తుంది.



అండర్- 19 ఎస్‌జీఎఫ్ సూపర్ సెవెన్ క్రికెట్ టోర్నీలో తలపడనతున్న జట్లు (ఫైల్)

దేశ వ్యాప్తంగా 40కి పైగా జట్లు హాజరు

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్- 17 బాల,బాలికల క్రికెట్ చాంపియన్‌షిప్‌కు దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్ర విద్యా సంస్థల నుంచి దాదాపు 40కి పైగా జట్లు పాల్గొనే అవకాశం ఉంది. రెండు విభాగాలకు ఒక్కో రాష్ట్రం నుంచి బాల, బాలికల జట్టులో 16 మంది చొప్పున క్రీడాకారులు, కోచ్, మేనేజర్ హాజరవుతారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మరోసారి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలకు ఆతిథ్యం ఇస్తుండడంపై సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం

2025- 26కు సంబంధించి జిల్లాకు ఎస్‌జీఎఫ్ అండర్- 17 విభాగం బాల, బాలికల క్రికెట్ టోర్నీలు కేటాయించినందుకు సంతోషంగా ఉంది. పీడీలు, పీఈటీలు, క్రీడాసంఘాల సహకారంతో ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తాం.

– శారదాబాయి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు

పాలమూరు జిల్లాకు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించిన నేపథ్యం ఉంది. కరోనా సమయం మినహా ప్రతి ఏడాది జాతీయస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. 2015లో అండర్- 14 జాతీయ క్రికెట్, 2016లో అండర్- 14 జాతీయ వాలీబాల్, 2017లో అండర్- 14 జాతీయ నెట్‌బాల్ టోర్నీ, 2018లో అండర్- 17 హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి టోర్నమెంట్, అదే ఏడాది జాతీయస్థాయి అండర్-14, అండర్- 17, అండర్-19 విభాగాల్లో టెన్నిస్ వాలీబాల్, అండర్-17, అండర్- 19 విభాగాల్లో పవర్ లిఫ్టింగ్ బాల, బాలికల పోటీలు నిర్వహించారు. అదే విధంగా 2020 జనవరి 11 నుంచి 15 వరకు జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ జాతీయ అండర్- 19 సూపర్‌సెవన్ బాల,బాలికల క్రికెట్ టోర్నీలు నిర్వహించారు. గతేడాది డిసెంబర్‌లో కోస్గి పట్టణంలో అండర్- 19 ఎస్‌జీఫ్ బాలుర జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీ, ఈ ఏడాది జనవరి 10- 14 వరకు పాలమూరు పట్టణంలోని మెయిన్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ఐ అండర్- 17 నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు విజయవంతంగా నిర్వహించారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- పదింటిలో.. ఏడు క్రస్టు గేట్ల మూసివేత
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



మూడు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద

ధరూరు/దోమలపెంట/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గత నాలుగు రోజులుగా ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 72వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 53వేల క్యూసెక్కులకు తగ్గిందన్నారు. దీంతో తెరిచిన 10 క్రస్టు గేట్లలో ఏడింటిని మూసివేసి మూడింటి ద్వారా 12,303 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తికి 38,164 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు-1కు 650, ఆవిరి రూపంలో 69 , ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 500, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు-2కు 750, ప్రాజెక్టు నుంచి మొత్తం 53,771 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.869 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి 49,363 క్యూసెక్కులు

జూరాలలో ఆదివారం విద్యుదుత్పత్తి చేస్తూ 37,160 క్యూసెక్కులు, ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 12,203 మొత్తం 49,363 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 855.2 అడుగుల వద్ద 92.4860 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు.

11 యూనిట్లలో 435 మెగావాట్ల విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్ల ద్వార విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 46.172 మి.యూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 52.209 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 98.381 మి.యూ విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

'గద్వాల కోటపై బీసీ జెండా ఎగరేస్తాం'



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

ఎర్రవల్లి: రాబోయే ఎన్నికల్లో గద్వాల కోటపై బీసీ జెండా ఎగరేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గద్వాలలో బంగ్లా, బండ్ల కుటుంబాలు ఆడే రాజకీయ చదరంగంలో బీసీలు బలవుతున్నారని.. పైకి శత్రువులుగా నటిస్తూ లోన మాత్రం ఒక్కటేనన్న విషయం గత అసెంబ్లీ ఎన్నికల్లో రుజువైందని, అందరూ ఏకమై బీసీ అభ్యర్థిని ఓడించిన విషయం మర్చిపోలేదన్నారు. బీసీలు రాజ్యాధికారం సాధించాలంటే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలు కీలకమని.. అన్ని జనరల్ స్థానాల్లో బీసీలు పోటీచేసి గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక ఎన్నికలు జరపాలని.. లేని పక్షంలో ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని.. కష్టపడేది ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే పదవులు అనుభవించేది మాత్రం అగ్రవర్ణాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నియమించే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహా యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, మండల అధ్యక్షుడు ఈదన్న నాయుడు, నాయకులు ఎల్లగౌడ్, పాండురంగ యాదవ్, వీవీ గౌడ్, గూడుసా, దేవర శివ, అంజన్న యాదవ్, బత్తుల జితేందర్, ధర్మేంద్ర సాగర్, నర్సింహా, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆముదం సాగు.. లాభాలు బాగు

- అధికారుల సూచనలతో అధిక దిగుబడి
- కేవీకే శాస్త్ర వేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రైతులు స్వల్ప కాలిక ఆముదం పంట సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన వేదిక మదనాపురం శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి సూచిస్తున్నారు. ఆముదం పంట ముఖ్యమైన నూనె గింజల పంటలలో ఒకటి. ఆముదం విత్తనాలలో 40–50 శాతం నూనె కలిగి ఉంటుంది. ప్రపంచంలోని ఆముదం నూనె అవసరాలలో మన దేశం నుంచే 90 శాతం సరఫరా అవుతుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో ఒకప్పుడు అత్యధిక మంది ఆముదాన్ని సాగు చేసేవారు. అధిక వర్షాలు, గోళ బూజు తెగుళ్ల వల్ల క్రమేపి దిగుబడులు తగ్గడంతో ఆముదం సాగుపై రైతులు ఆసక్తి తగ్గించారు. అయితే జాతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం కొత్త హైబ్రీడ్ రకాలను తయారు చేసి ఆముదం సాగు ప్రోత్సహిస్తుంది. ఈ సాగుకు హైబ్రీడు ఐసీహెచ్–5 రకం చాలా అనుకూలం. ఈ క్రమంలో రైతన్నలు మళ్లీ ఆముదం సాగుపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.



పాడి-పంట

కేవీకే శాస్త్ర వేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి

సాగు విధానం..

- సాలు సాలుకు 2 ఫీట్ల దూరం , మొక్క మొక్కకు 1 ఫీటు దూరంలో అధిక సాంద్రతలో విత్తుకోవాలి
- పంట వయస్సు 30–35 రోజులలో, 40–45 రోజులలో 2 సార్లు ప్యాక్లో బ్యుట్రజోల్ 23 శాతం హార్మోన్‌ను 0.35మి.లీ లీటరు నీటిలో కలిపి మొలక మొత్తం తడిసేలా పిచికారీ చేయడం వల్ల కణుపుల మధ్య దూరం తగ్గి మొక్క పొడవు తగ్గుతుంది.
- గెల పొడవు కూడా తగ్గి కాయల సంఖ్య, గెలల సంఖ్య తగ్గిస్తే దిగుబడి పెరుగుతుంది.
- పంట కాలం 2–3నెలలు తగ్గి తద్వారా అయ్యే ఖర్చు ఆదా అవుతుంది. 2వ పంట వేసుకునే అవకాశం ఉంటుంది.
- మొక్కల సాంద్రత పెంచడం వల్ల, పంట కాలం తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుంది. కొంత వరకు పంట బూజు తెగులును సమర్థవంతంగా తప్పుకోవచ్చును.
- పంటలో బుజు తెగులను గమనిస్తే ప్రాపికోనోజోల్ 1మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి
- పంటలో దాసరి పురుగు, లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే బీటీ 1గ్రాం లేదా ఫ్లూ బెండమైడ్ 0.4 గ్రాం లేదా ప్రొపలినోఫాస్ 2మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పంట మొదటి, రెండో గెలలు ఎండుతున్నప్పుడు, ఎకరానికి 200మి.లీ పారక్వాట్ అనే కలుపు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే 3–4రోజులలో మొక్కలు పూర్తిగా ఎండిపోయి సులభంగా యంత్రాలతో పంటకోత చేసి కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చును.







సందర్శకులతో 'జూరాల' కిటకిట

ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండడంతో జూరాల ప్రాజెక్టు నిండుకుందను తలపిస్తుంది. ఆదివారం 5 క్రస్ట్ గేట్లను తెరిచి నీటిని దిగువకు వదిలారు. దీంతో పర్యాటకులు నీటి ప్రవాహాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. సెలవుదినం కావడంతో పిల్లాపాపలతో కలిసి వచ్చి ఎగువ భాగంలో జలాశయం అందాలు తిలకిస్తూ.. దిగువ ప్రాజెక్టులో నది వద్దకి వెళ్లి సరదాగా గడిపారు. నీటి ప్రవాహాన్ని తమ కెమెరాల్లో బంధిస్తూ.. సెల్ఫీలు దిగారు. ఇదిలాఉండగా, నీటి ప్రవాహం ఉన్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసులు పహారా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– అమరచింత

సాగునీరు అందని ద్రాక్షేనా?



గువ్వలోనిపల్లి సమీపంలో డిండి ప్రాజెక్టు కుడి కాల్వ దుస్థితి

- ఆధునికీకరణకు నోచుకోని డిండి కుడి కాల్వ
- పట్టించుకోని నల్లగొండ జిల్లా ఇరిగేషన్ అధికారులు
- దుస్థితికి చేరుకున్న కెనాల్.. ఆందోళనలో ఆయకట్టు రైతులు



లత్తీపూర్ శివారులో కుడి కాల్వ ఇలా..

ఉప్పునుంతల: డిండి ప్రాజెక్టు సాగునీటి విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఉప్పునుంతల మండల రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి నల్లగొండ జిల్లా రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతూ వస్తోంది. ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందుతుండగా.. దాదాపు 20 ఏళ్ల క్రితం పాలమూరు జిల్లాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన కుడి కాల్వ పనులు వంతుకు గంతేసినట్టుగా చేపట్టారు. కాల్వ పూడిపోయి కంపచెట్లు పెరగడంతో సాగునీరు ముందుకు పారడం లేదు. వడ్డెర గుడిసెల వరకు సిమెంట్ కాల్వ వెంట కొద్దిపాటి నీరు వెళ్తుండటంతో రైతులు కొంతమంది డిండి నీటి ఆధారంతో పంటలు వేసుకుంటున్నారు. కాల్వ నీళ్లకు పంట పండుతుందనే నమ్మకం లేక ఎక్కువ మంది రైతులు ఆశలు వదులుకునే పరిస్థితి నెలకొంది. కాల్వ వెంట నీరు వదిలినా తీగలకుంట కింద ఉన్న సిమెంట్ కాల్వ ఎత్తు సరిపడా లేక నీరు ఎక్కి పారడం.. కాల్వకు అక్కడక్కడ రంధ్రాలు పడి కొంత నీరు ప్రాజెక్టు దిగువన ఉన్న డిండి వాగులో వృథాగా పారుతుంది. గువ్వలోనిపల్లి మర్రికుంట వరకు నిర్దేశించిన కాల్వ సరిగా లేకపోవడంతో రైతులు ఏనాడు పంటలు పండించుకోలేదు. ప్రాజెక్టు పూర్తి ఆజమాయిషీ నల్లగొండ జిల్లాకు చెందిన అధికారులు కావడంతో.. వారు కుడి కాల్వ ఆయకట్టు రైతులకు సాగునీరందించే విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

325 ఎకరాల ఆయకట్టు..

ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్, గువ్వలోనిపల్లి శివారులో 325 ఎకరాలకు సాగునీరందేలా డిండి ప్రాజెక్టు కుడి కాల్వను తీశారు. ప్రాజెక్టులో 16 అడుగుల నీటి నిల్వ ఉన్నప్పుడు మాత్రమే నీరు విడుదల చేసేలా కుడి కాల్వను నిర్మించారు. అయితే ప్రాజెక్టు నీటి స్టోరేజీ మధ్య నుంచి లత్తీపూర్, వడ్డెర గుడిసెలు, గువ్వలోనిపల్లి మర్రికుంట వరకు దాదాపుగా 7 కి.మీ., మట్టి కాల్వ ఆధునికీకరణ కోసం రూ. 1.50 కోట్లు (జపాన్ నిధులు) ఖర్చుచేశారు. ఈ నిధులలో 5 కి.మీ. మేర కాల్వను ఆధునికీకరించే పనులు చేపట్టారు. కొంత దూరం ఇంతకు ముందు రాళ్లతో కట్టిన పాత కాల్వ మరమ్మతుతోనే సరిపెట్టారు. కొంతదూరం మాత్రమే మట్టి కాల్వకు సిమెంట్ కాంక్రీటు నిర్మించారు. అదీ కూడా నాసిరకంగా ఉండటంతో కాల్వకు అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. రెండేళ్ల క్రితం తిరిగి కాల్వకు మరమ్మతు చేయించినా ప్రయోజనం లేకుండ ఉంది. వడ్డెర గుడిసెల నుంచి మర్రికుంట వరకు రెండు కిలోమీటర్ల మేర సీసీ పనులు చేపట్టకుండా వదిలేసిన మట్టి కాల్వ అధ్వానంగా తయారైంది.

డ్రెయినేజీని తలపిస్తున్న కుడి కాల్వ..

పారుగున ఉన్న జిల్లా నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్ కావడంతో పనులు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకొన్నారు. రూ.లక్షలు ఖర్చుచేసినా ప్రాజెక్టు కుడి కాల్వ మాత్రం గ్రామాల్లో నిర్మించే చిన్నపాటి డ్రెయినేజీని తలపిస్తోంది. కాల్వను చూస్తే జిల్లాకు చెందిన రైతులపై చవతి తల్లి ప్రేమ చూపించారనేది స్పష్టంగా కనిపిస్తోంది. కాల్వను తవ్వి ఎనిమిదేళ్లు గడవగా.. ఇప్పటికీ నాలుగు పర్యాయాలు మాత్రమే కుడి కాల్వ వెంట నీటిని వదిలారు. అందులో ఒక పంటకు మాత్రమే చివరి వరకు నీరు అందింది. ఒక వేళ డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా తమ పొలాలకు నీరు అందని పరిస్థితిలో కాల్వ ఉందని రైతులు వాపోతున్నారు. వడ్డెర గుడిసెల నుంచి కాల్వలో పూడిక తీయడంతో పాటు మొదట ఉన్న సిమెంట్ కాల్వకు తిరిగి మరమ్మతు చేపట్టకపోతే చివరి వరకు సాగునీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి డిండి కుడి కాల్వ ఆధునికీకరణపై దృష్టి పెట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీరు ముందుకు పారడం లేదు..



కుడి కాల్వ పనులు నాసిరకంగా చేపట్టారు. తీగలకుంట కింద సిమెంట్ కాల్వ ఎత్తు లేకపోవడంతో నీరు ఎక్కి పారి వాగులో పడిపోతున్నాయి. గువ్వలోనిపల్లి సమీపంలో కాల్వ సరిగాలేక ముందుకు పారడం లేదు. దాదాపు 20ఏళ్ల క్రితం తీసిన కుడి కాల్వ వెంట ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సాగునీరు అంది ఒక పంట కూడా పండించుకోలేదు. అధికారులు నల్లగొండ జిల్లాకు చెందిన వారు కావడంతో వారు ఏ రోజు కాల్వ వైపు వచ్చి చూడరు. నల్లగొండ జిల్లాకు నీరందే ఎడమ కాల్వ పైనే శ్రద్ధ చూపుతారు.

– దాసరి కృష్ణయ్య, రైతు, లత్తీపూర్

13 అడుగుల కొండచిలువ పట్టివేత



కొండచిలువ, ఉడుమును పట్టుకున్న స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్, సభ్యులు

ఉడుమును మింగికక్కిన పైనం

గోపాల్‌పేట: ఐదడుగుల పొడవున్న ఉడుమును కొండ చిలువ మింగి కక్కేసిన ఘటన గోపాల్‌పేట మండలం బౌసులకుంట సమీపంలో ఆదివారం జరిగింది. మండల కేంద్రానికి సమీపంలోని రేకులగడ్డ కాలనీ సమీపంలోని బౌసులకుంట వద్ద 13 అడుగుల పొడవున్న భారీ కొండచిలువ ఉడుమును మింగుతుండగా స్థానికులు గమనించారు. అనంతరం స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా స్పందించిన కృష్ణసాగర్ సిబ్బందితో కలిసి కొండచిలువను అతి కష్టం మీద పట్టుకున్నారు. అప్పటికే కొండచిలువ ఉడుమును మింగి బయటికి కక్కడంతో ఉడుము చనిపోయింది. అనంతరం కొండచిలువను బంధించారు. విషసర్పాలు, అటవీ జంతువుతో జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్‌సాగర్, అవినాష్, కుమ్మరి బాలస్వామి, బిక్షపతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



వృథాగా పోతున్న నీరు

మరికల్: నారాయణపేట జిల్లా కేంద్రానికి తాగునీరు అందించే మిషన్ భగీరథ పైపులైన్ మరికల్ శివారులో పగిలి నీరంత వృథాగా చెరువులోకి పోతుంది. పైపులైన్ పగలడంతో వివిధ గ్రామాలతో పాటు జిల్లా కేంద్రానికి కలుషిత నీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ పగిలిన దగ్గర రైతుల పొలాల్లోకి నీరు పారుతుండటంతో నాటిన పత్తి విత్తనాలు కొట్టుకుపోతున్నాయని, ఇక మొలకెత్తిన మొక్కలు నీటి శాతం ఎక్కువ కావడంతో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.